"వెధవ కేసు, చచ్చుకేసు. డబ్బివ్వాలంట. ఎక్కడుంది డబ్బు! అది ఎప్పుడో మింగేసింది రోషనీ. పాతిక వేలూ పుచ్చుకుని ఒక్క ముద్దు కూడా పెట్టలేదు లం....!" అనుకుంటే రోషనీ తీరు గుర్తుకు వచ్చింది హరీశ్‌కు.

★ ★ ★

"ఆయన కళ్ళుకప్పి మనమెక్కడకైనా వెళ్దాం. ఇక్కడ కుదరదు. ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలా, ప్రేమించాను ప్రేమించాను అంటూ నావెంట పడటం తప్ప!" అంది రోషనీ.

"ఎవరా ఆయన?"

"మా బావ. మహా కర్కోటకుడు. ఇంట్లో నుంచి బయట పడటమే కష్టంగా ఉంది."

"డబ్బు పుచ్చుకునేటప్పుడు తెలియదా, ఆ సంగతి?"

"మా అమ్మకు ఒంట్లో బాగాలేదు, ఆమెకి పంపాలి అని తీసుకున్నాను కానీ నేను డబ్బు మనిషిని కాను. కావాలంటే రేపు మా బావనడిగి నీ డబ్బు నీకిస్తానులే"

"నేను డబ్బు ఇవ్వమని అడిగానా ఏం? నాతో ఓ గంట సేపయినా గడపమని అడిగాను కానీ."

"ఆ గడపటమూ అవీ పెళ్ళయ్యాకే."

"పెళ్ళంటే మాటలా? ఎంత తతంగం ఉంది. అయినా మనకిప్పుడేం తొందర"

"నాకేం తొందర లేదు. నువ్వు తొందర పడకుండా ఉంటే చాలు. నువ్వేమనుకోకపోతే, మరోపదిహేను వేలు సర్దగలవా, అమ్మకి పంపాలి. వీలయితేనే, బలవంతం ఏంలేదు."

అక్కడ "సరే" అని వచ్చాడు కానీ ఇంతవరకూ ఏ చేపా గాలంలో పడలేదనుకుంటూంటే శ్రీమన్నారాయణ వచ్చాడు. అతనికి బ్యాంకులో డబ్బుతీయటం ఇష్టంలేదు. శ్రీమన్నారాయణ ఇస్తాడేమోనని చూశాడు కానీ, "వెధవ" మింగుడు పడలేదు.

★ ★ ★

కొడుక్కు బదిలీ కాలేదు కానీ, అప్పుతెచ్చి, భార్యగొలుసు అమ్మి తెచ్చిన డబ్బు గంగలో కలిసినట్లయింది శ్రీమన్నారాయణ పరిస్థితి. ఆయనకేం చేయాలో తోచడం లేదు. వ్యాకులపడిపోయాడు. ఊరంతా తిరిగి సాయంత్రానికి సీతాఫలమండీలో ఉన్న అన్న కొడుకు వెంకటేశం ఇంటికి వచ్చాడు.

పిన తండ్రిని చూడగానే అడిగాడు వెంకటేశం "నీ పనైందా బాబాయ్! ఇంతకు ముందే వరంగల్లు నుండి వచ్చాను. నువ్వు పొద్దున వచ్చావటగా?"

శ్రీమన్నారాయణ పరిస్థితిని వివరించి చెప్పాడు.

"హరీశ్ ఇంత మోసం చేస్తాడని నేననుకోలేదు. ఎం.ఎల్.ఎ ధర్మరాజుగారు నాకు

